క్లుప్తంగా

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ



మాగనూర్: మండలంలోని బైరంపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠశాల హెచ్ఎం వినోద్‌కుమార్ ఐడీ కార్డులు, టై, బెల్టులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చక్కగా చదువుకొని ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనునాయక్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ మేఘన పాల్గొన్నారు.

రేపు యాదవ సంఘం సమావేశం

దామరగిద్ద: అఖిల భారత యాదవ సంఘం మండల స్థాయి సమావేశాన్ని ఆదివారం క్యాతన్‌పల్లిలో వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేయనున్నట్లు సంఘం నాయకులు శ్రీనివాస్ యాదవ్, నారాయణయాదవ్ తెలిపారు. నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమానికి అఖిల భారతయాదవ మహాసభ జాతీయ కార్యదర్శి రమేష్‌యాదవ్, వెంకట నర్సయ్య యాదవ్ హాజరవుతున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల యాదవులు హాజరై కార్యవర్గ ఎన్నికలను విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాల తనిఖీ



కృష్ణా: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలను శుక్రవారం ఎంపీడీఓ జానయ్య, తహసీల్దార్ దయాకర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మాట్లాడారు.. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలన్నారు. అదేవిధంగా వంటలు వండే పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, దాంతోపాటు బియ్యం, కూరగాయాలు, నాణ్యతగా ఉండాలని సూచించారు. అనంతరం వారు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



ఆత్మకూర్: నియోజక అభివృద్ధే ధ్యేయంగా మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి ముందుకెళ్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. శుక్రవారం మండలంలోని పిన్నంచర్లలో రూ.10లక్షల ఎమ్మెల్యే నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. గతంలో వెనక్కి వెళ్లిన నిధులు ఎమ్మెల్యే చొరవతో మంజూరయ్యాయని, ఈసందర్భంగా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్‌యాదవ్, గణేష్, మచ్చేందర్‌గౌడ్, మణివర్ధన్‌రెడ్డి, ఖాజన్న, విజయలక్ష్మి, రాములు, రామచంద్రి, సత్యన్న, విష్ణు, మాజీ సర్పంచ్ లక్ష్మి, మాసన్న పాల్గొన్నారు.

ఘనంగా అయప్ప పూజ

గండేడ్: మండలంలోని పంచాంగల్‌తండాలో అయప్ప పటం పూజ ఘనంగా నిర్వహించారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పెంట్యానాయక్ ఇంట్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. రాజు గురుస్వామి ఆధ్వర్యంలో పూజారి వినోద్ సమక్షంలో గణపతి, కుమారస్వామి, అయప్ప స్వాముల అంగపూజ, అష్టోత్తర శతనామావళి పూజలను చేశారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. అయప్ప మాలధారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు చెన్నయ్య, బాల్‌రాజ్, గోపాల్, గోవర్ధన్, శ్రీనివాస్, చందుతో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మహమ్మదాబాద్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బిక్షపతి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్‌రాంరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు హనుమాన్ చాలీసా పారాయణం

స్టేషన్ మహబూబ్‌నగర్: విశ్వహిందూ పరిషత్ పాలమూరు ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 5గంటలకు హనుమాన్‌చాలీసా పారాయణం నిర్వహిస్తున్నట్లు శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ సుందరీకరణ కమిటీ చైర్మన్ పోల శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్వరలహరి కల్చర్ అకాడమీ బృందంచే సింహగిరిలోని లక్ష్మీనరసింహస్వామి యంలో నిర్వహిస్తున్నారన్నారు.



ఊట్కూర్‌లో మాట్లాడుతున్న తహసీల్దార్ రవి



మరికల్‌లో పోటీలను ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి



కోస్గిలో పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ కోడిగంటి అన్నపూర్ణహరి

కోస్గి రూరల్: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించడానికి కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ కోడిగంటి అన్నపూర్ణహరి అన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు శారీరక ధ్రుడత్వాన్ని, మానసికోల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు మెమెంటోలను అందించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్ కుమార్, ఎంపీడీఓ శ్రీధర్, తహసీల్దార్ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, సీఐ దస్రునాయక్, నాయకులు రఘువర్ధన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, తుడుం శ్రీనివాస్, బాలేష్, ఇద్రిస్, వ్యాయమ ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఊట్కూరు: క్రీడలతో క్రమశిక్షణ అలవడుతుందని తహసీల్దార్ రవి అన్నారు. శుక్రవారం సీఎం కప్ గ్రామీణ క్రీడలలో భాగంగా మండల స్థాయి ఆట పోటీలను నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం గ్రామీణ స్థాయి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పాఠశాలలో క్రీడా పోటీలను చేపట్టడం సంతోషకరమని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్, ఎస్ఐ కృష్ణంరాజు, నాయకులు సూర్యప్రకాష్‌రెడ్డి, విఘ్నేశ్వర్‌రెడ్డి, లింగం, శేఖర్‌గౌడ్, జగదీష్‌గౌడ్, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

మరికల్: క్రీడలతో మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సీఎం కప్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే క్రీడల్లో విద్యార్థులు పాల్గొనాలని సూచించారు. మండల స్థాయి సీఎం కప్ పోటీలో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా టీంకు ఎంపిక చేస్తారని తెలిపారు. ఎస్ఐ రాము, సూర్యమోహన్ రెడ్డి, వీరన్న, కృష్ణయ్య, రామకృష్ణారెడ్డి, హరీష్, ఆంజనేయులు, శ్రీకాంత్‌రెడ్డి, కొండన్న పాల్గొన్నారు.

మండల స్థాయి సీఎం కప్ పోటీలు ప్రారంభం

ధన్వాడ: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండల స్థాయి సీఎం కప్ పోటీలను మార్కెట్ కమిటీ చెర్మన్ సదాశివరెడ్డి ప్రారంభించారు. మండలంలోని 8గ్రామ పంచాయతీల నుంచి క్రీడాకారులు పోటీలలో పాల్గొన్నారు. ఇందులో గెలుపొందిన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీలో పాల్గొంటారని కోచ్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాయిప్రకాష్, తహసీల్దార్ సింధుజ, ఎంఈఓ గాయత్రి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నర్సింహ, రామ్మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో విద్యార్థికి మొదటి బహుమతి

దామరగిద్ద: సీఎం కప్ క్రీడా పోటీల్లో మండలంలోని మొగుల్‌మడ్క జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి స్రవంతి వంద మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల జీహెచ్ఎం ఎంఈఓ కృష్ణారెడ్డి విద్యార్థిని మోడల్స్‌తో సత్కరించారు. చదువుతో పాటు క్రీడాల్లో రాణించాలని, జిల్లా స్థాయిలో మంచి ప్రతిభ కనబరచాలని కోరారు. ఉపాధ్యాయులు భీరప్ప, బసదయ్య, నవ్యశ్రీ, భాగ్యమ్మ, మోహన్‌రెడ్డి అంజిలప్ప, తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజు కొనసాగిన ధర్నా..



అంబేడ్కర్‌కు వినతిపత్రం అందిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

నారాయణపేట రూరల్: సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక నిరసన రెండోరోజు కొనసాగింది. శుక్రవారం ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. అనంతరం మున్సిపల్ పార్క్ వద్ద శిబిరంలో ధర్నా చేపట్టారు. దీనికి పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు యాదగిరి, జనార్దన్ రెడ్డి, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు తీర్చాలని, వారి సర్వీసును రెగ్యులర్ చేస్తూ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు హామీని తీర్చాలని కోరారు. అనంతరం డీఈఓ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు వెంకట్ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, రఘువీర్, రాజేష్, ఆరీఫ్, రవి ప్రకాష్, నారాయణ, గౌరమ్మ, గంగమ్మ, విజయ, శాలిని, రాజశేఖర్, శశికాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

దామరగిద్ద: మద్యం తాగి వాహనాలు నడిపితే రెండురోజులు జైలు శిక్ష పడుతుందని ఎస్ఐ రాజు అన్నారు. రెండో రోజులు క్రితం వాహన తనిఖీల్లో నర్సాపూర్ గ్రామానికి చెందిన వెంకటేష్ డ్రంక్‌అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడ్డాడని తెలిపారు. కేసును మోదు చేసి దర్యాప్తుచేసి కోస్గి కోర్టుకు రిమాండ్‌కు పంపించామన్నారు. మెజిస్ట్రేట్ పర్వీనబేగం రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లుతెలిపారు. యువకులు మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావొద్దన్నారు.

టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక



మాగనూర్: టీఎస్ యూటీఎఫ్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నట్లు రాష్ట్ర కమిటీ సభ్యులు వేణుగోపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటస్వామి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల అధ్యక్షుడిగా రాఘవేంద్రచారి, మండల ప్రధాన కార్యదర్శిగా నాగేష్, ఉపాధ్యక్షుడిగా మౌనిక, దుబ్బన్న, మండల కార్యదర్శులుగా జమ్మన్న, రామకృష్ణచారి, విజయలక్ష్మి, శంకర్, గోపాల్, హుస్సేన్‌సాబ్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

చిరుత దాడులతో భయాందోళన

దామరగిద్ద: మండలంలోని పలు గ్రామాల్లో చిరుత సంచారంతో పలు గ్రామాల్లో పశువులపై రాత్రి వేళల్లో దాడులు చేస్తుండంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. గతనెల రోజుల క్రితం బాపన్‌పల్లిలో ఓ మేకపై దాడిచేయడం, దామరగిద్ద తాండ రైతుకు చెందిన లేగదూడపై దాడి చేసి తిన్నది. వరుస ఘటనలతో రైతులు భయాందోనకు గురవుతున్నారన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం బీకేఎస్ మండల అధ్యక్షుడు సుభాష్, జిల్లా నాయకుడు బాల్‌చందర్‌రెడ్డి పారెస్ట్ అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. చిరుత సంచారంతో వరుసగా పశువులను బలితీసుకుంటన్న పారెస్ట్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని చిరుత దాడులను నుంచి రైతులు, పశువులు కాపాడేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు దత్తజయంతి వేడుకలు

నారాయణపేట రూరల్: పట్టణంలోని సద్గురు అవధూత నర్సింహస్వామి మఠంలో శనివారం దత్తజయంతిని నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం హారతి, పాదపూజ, యజ్ఞం, డోలారోహణం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

ధర్మాగ్రహ దీక్ష వాల్‌పోస్టర్ ఆవిష్కరణ




కోటకొండలో వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

నారాయణపేట ఎడ్యుకేషన్: ఈ నెల 17న హైదరాబాద్ ధర్నా చౌక్‌లో నిర్వహించనున్న ధర్మాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని తపస్ మండల నాయకులు నర్సింహులు అన్నారు. శుక్రవారం మండలంలోని కోటకొండ, తిరుమలపూర్, కొల్లంపల్లి ఉన్నత పాఠశాలల్లో భోజన విరామ సమయంలో ధర్మాగ్రహ దీక్ష వాల్‌పోస్టర్‌ను ఉపాధ్యాయుల సమక్షంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లులు చెల్లించాలని నాలుగు డీఏలు, పీఆర్‌సీని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, స్వాతి, భీమేశ్వరి, శంకర్ నాయక్, మౌనిక పాల్గొన్నారు.

మరికల్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మండల అధ్యక్షుడు సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్మాగ్రహ దీక్ష పోస్టర్‌ను విడుదల చేశారు. సురేష్, హెచ్ఎం బాలనారాయణ, చంద్రశేఖరయ్య, గోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ధన్వాడ: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. తపస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్మాగ్రహ పోస్టర్‌ను మండలంలోని బాలికల ఉన్నత పాఠశాలలో విడుదల చేశారు. నాయకులు మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు డీఏలు, పీఆర్‌సీ అమలు చేయాలని 317జీఓ సవరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సికిందర్, అశోక్, హెచ్ఎం గాయత్రి, శైలజ, సంధ్యారాణి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సామిల్ అండ్ టింబర్ డిపో అసోసియేషన్ ఎన్నిక



నారాయణపేట: జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ ఆలయంలో జిల్లా సామిల్ అండ్ టింబర్ డిపో అసోసియేషన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మద్దూరు రవికుమార్‌గౌడ్, కార్యదర్శిగా శ్రీనివాస్‌చారి, ఉపాధ్యక్షుడిగా మరికల్ తిరుపతయ్యచారి, పేట కోన మల్లికార్జున్, మక్తల్ బ్రహ్మయ్యచారి, కోస్గి ఎండీ పాషాను ఎన్నుకున్నారు.

రహదారిపైనే పంట నూర్పిళ్లు



రహదారిపై వరిధాన్యం ఆరబోసిన రైతులు

అమరచింత: వరిధాన్యాన్ని రహదారులపై ఆరబోసి నూర్పిళ్లకు పాల్పడుతుండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటాయే అన్న భయాందోళనలో ప్రయాణికులు తమ వాహనాలను నడపాల్సిన పరిస్థితులు దాపరిస్తున్నాయి. మండలంలోని నాగల్‌కద్మూర్ శివారు నుంచి నాగిరెడ్డిపల్లి వరకు ప్రధాన రహదారిపై వరిధాన్యం కుప్పలుగా పోయడం, వాటిని రహదారిపై ఆరబెట్టడంతో భారీ వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. రోడ్డు సగం వరకు ధాన్యం ఆరబోస్తుండడంతో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోతు ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆయా గ్రామాలకు చెందిన ప్రయాణికులు వెల్లడిస్తున్నారు. అధికారులు స్పందించి రహదారిపై పంట నూర్పిళ్లకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



కోయిల్‌కొండ: మండల కేంద్రంలో ప్రసిద్ధి చెందిన ఆదిఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం హనుమత్ త్రయోదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు రాఘేందర్‌రావు తెలిపారు. స్వామివారికి వాయుస్తుతితో ఫల పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించారు. భక్తుకు తీర్థప్రసాదాలు అందించారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ విడుదల చేస్తున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన హెల్త్ కేర్ ఫార్మసీ ఆధ్వర్యంలో 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్యాలెండర్‌లో వివిధ రకాలైన రోగాలకు సంబంధించిన నివారణ చర్యలు, ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తూ రూపొందించడం చక్కగా ఉందని అభినందించారు. అనంతరం అడిషనల్ ఎస్పీ రియాజ్ ఉల్ హక్‌కు క్యాలెండర్ అందించారు. కార్యక్రమంలో ఫార్మసిస్టులు రహమతుల్లా, సయ్యద్ అహ్మద్ తాజ్, రియాజ్ అహ్మద్ కురుషి పాల్గొన్నారు.

ఆహార భద్రతపై దృష్టిసారించాలి

మక్తల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన విషయంలో ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిసారించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గుడిగండ్ల, జక్లేర్ తదితర గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేసి.. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం స్టోర్‌రూం, బియ్యం, కూరగాయలు, తాగునీటి వివరాలను నిర్వాహకులకు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రం, రేషన్‌షాపులను పరిశీలించారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకుంటామన్నారు. రేషన్ బియ్యం అమ్మితే పింఛన్ కట్ చేస్తామని బెదిరించాలని డీలర్‌కు సూచించారు. లబ్ధిదారులకు వచ్చే బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తే లబ్ధిదారులు వాటిని వేసుకోని దళారులకు అమ్ముకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఫుడ్ కమీషన్ సభ్యులు గోవర్ధన్, శారధ, భారతి, ఆర్డీఓ రాంచందర్‌నాయక్, డీఆర్‌డీఏ పీడీ మొగులప్ప, డీఎంఓ దేవాదాసు, డీఎస్ఓ సుదర్శన్, సీడీపీఓ సరోజినీమట్ట, తహసీల్దార్ సతీష్ కుమార్, ఎంపీడీఓ రమేష్, ఎంఈఓ అనిల్‌గౌడ్, సూపర్‌వైజర్ మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

నారాయణపేట: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఆర్పీ (రిసోర్స్ పర్సన్)లకు జరుగుతున్న అన్యాయాన్ని, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీస్తారని అక్కసుతో ఆర్పీలను పోలీసులు అక్రమంగా అరెస్టులుచేసి పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడాన్ని ఖండిస్తున్నామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామరెడ్డి అన్నారు. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో సుమారు ఆరువేల మంది ఆర్పీలుగా కొనసాగుతున్నారని, సంక్షేమ పథకాలను మున్సిపాలిటీల్లో ఉన్న ఎస్ఎస్‌జీ, ఎస్ఎల్ఎఫ్, మహిళలకు బ్యాంకు రుణాలు ఇప్పించడం, సకాలంలో చెల్లించేలా చూడడం వీరు ప్రముఖ పాత్ర వహిస్తారన్నారు. ఏ ప్రభుత్వాలు వీరిని గుర్తించకపోగా కేవలం రూ.6వేలు మాత్రమే వేతనం ఇస్తూ పొట్ట కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అమలవుతున్న జీఓ నంబర్ 60ప్రకారం ఆర్పీలకు కనీస వేతనం ఇవ్వాలలని డిమాండ్ చేశారు. ప్రతి నెల రెగ్యులర్‌గా వీఎల్ఆర్ నుంచి కాకుండా ప్రభుత్వమే వారి వ్యక్తిగత ఖాతాల ద్వారా వేతనం చెల్లించాలన్నారు. బాల్‌రాం, ఆర్పీలు సౌభాగ్య, సుజాత, లక్ష్మి, రఘుబాయి, గౌసియా, లింగమ్మ పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి గ్రామ కమిటీలు



నర్వలో ఎన్నికైన సభ్యులతో జిల్లా నాయకులు

నర్వ: గ్రామ గ్రామాన బీజేపీని బలోపేతం చేసేందుకు బూత్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు మండల కన్వీనర్ కుర్వ సత్యం అన్నారు. శుక్రవారం మండలంలోని లక్కర్‌దొడ్డిలో బీజేపీ బూత్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బోయ చెన్నప్ప, కార్యదర్శి గొల్ల రవి, ఇతర ప్రముఖులుగా కృష్ణయ్య, అమృతరెడ్డి, చిన్న కుర్మన్న, చింతలప్ప, శేఖర్, హన్మంతును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కుర్వసత్యం, వావిళ్ల రవికుమార్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: మండలంలోని మంత్రోనిపల్లి, గున్ముక్ల గ్రామాల్లో జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య ఆధ్వర్యంలో గున్ముక్ల గ్రామ బూత్ అధ్యక్షుడిగా శ్రీకాంత్, మంత్రోనిపల్లి గ్రామ బూత్ అధ్యక్షుడిగా తిరుపతి ఎన్నికయారు. ప్రతిబూత్ కమిటీ అధ్యక్షులు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలను గ్రామాల్లో ప్రజలకు వివరించాలని కోరారు.

గిడ్డంగి ప్రారంభోత్సవం ఎన్నడో..



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న గిడ్డంగి

అమరచింత: మండలంలోని ధర్మాపురం గ్రామ శివారులో రూ.10 కోట్లతో నిర్మించిన గిడ్డంగి ప్రారంభోత్సవానికి నోచుకోవడంలేదు. నిర్మాణ పనులు పూర్తయి ఐదు నెలల కాలం దాటుతున్నా ఇప్పటి వరకు వాటిని ప్రారంభించేందుకు సన్నాహకాలు చేపట్టకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హ యాంలో అమరచింత పట్టణానికి చెందిన సాయిచంద్ గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ చైర్మన్‌గా కొనసాగుతున్న సమయంలో ఆయన తన సొంత మండలంలో రైతులకు ఉపయోగపడే విధంగా పదివేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉంచే విదంగా గోదాంకు నిధులు మంజూరు చేయించారు. సూ మారు రూ.10కోట్లు మంజూరు చేస్తూ.. నిర్మాణ ప నులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించడం, అంతలోనే సాయిచంద్ మృతి చెందడంతో గిడ్డంగుల పనులు నెమ్మదించాయి. గిడ్డంగుల శాఖ కా ర్పొరేషన్ చైర్‌పర్సన్‌గా సాయిచంద్ సతీమణి రజనికి అప్పగించడంతో గిడ్డంగి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వీటిని వేగంగా ప్రారంభించాలని రైతులు వేడుకుంటున్నారు.

పకడ్బందీగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే



కోస్గిలో లబ్ధిదారుల వివరాలు సేకరిస్తున్న అధికారులు



సింగంపేటలో ఇందిరమ్మ ఇంటి సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కోస్గి రూరల్: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక కోసం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీఓ శ్రీధర్, తహసీల్దార్ శ్రీనివాసులు శుక్రవారం మండలంలోని ముక్తిపాడ్‌లో ప్రారంభించారు. వారు మాట్లాడుతూ లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఓపెన్ ప్లాట్ ఉందా.. సొంత ఇల్లు ఉందా... కిరాయికి ఉన్నారా అని తెలుసుకున్నారు. గ్రామంలో 158మంది లబ్ధిదారులకు గాను 25ఇళ్లకు సర్వేచేపట్టామన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, నాయకులు రఘువర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గిరిప్రసాద్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కృష్ణారెడ్డి, సర్పంచ్ రుక్మప్ప, నాయకులు నాగులపల్లి నరేందర్, అన్నకిష్టప్ప, ప్రకాష్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, రాంచంద్రరెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పకడ్బందీగా చేపడుతున్నామని ఎంపీడీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. శుక్రవారం ఆత్మకూర్ మండలంలోని గ్రామాలు, మున్సిపాలిటీలోని వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ శశిధర్, పంచాయతీ కార్యదర్శులు, వార్డుల అధికారులు పాల్గొన్నారు.



పిన్నంచర్లలో..

ఇంటి సర్వేలో తప్పిదాలొద్దు

అమరచింత: ఇందిరమ్మ ఇంటింటి సర్వేలో అర్హుల వివరాలను యాప్‌లో పొందుపరిచే సమయంలో తప్పిదాలుండొద్దని, పూర్తి వివరాలతో ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని సింగంపేటలో శుక్రవారం ఇందిరమ్మ ఇంటింటి సర్వే కార్యక్రమ పరిశీలనతో పాటు పారిశుధ్య పనులను పరిశీలించారు. ఇంటి కోసం దరకాస్తు చేసుకున్న వారి వివరాలన్నీ గ్రామాల వారీగా పంచాయతీ కార్యదర్శులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకున్నారన్నారు. అదేవిధంగా గ్రామంలో పారిశుధ్య పనులపై దృష్టి సారించాలని సూచించారు.